క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సత్కారం



తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డిని మంగళగిరి రూరల్ పార్టీ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. బుధవారం ఆయన తాడేపల్లి విచ్చేయడంతో మంగళగిరి రూరల్ పార్టీ అధ్యక్షులు నాళి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, నాయకులు కొల్లి శేషిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చిన్నారి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు తగదు

దుగ్గిరాల: మహా ప్రవక్త మహ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సుభాని అన్నారు. బుధవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్లాం అంటేనే శాంతికి చిహ్నమని, ప్రతి ఒక్కరూ దానిని గుర్తించాల్సిన అవసరముందని అన్నారు. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై, ఇస్లాంపై కనీస అవగాహన లేకుండా చిలుక ప్రవీణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశంలో కులమతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయని అన్నారు. ప్రవీణ్ కఠినంగా శిక్షించాలని సుభాని డిమాండ్ చేశారు. సమావేశంలో మైనార్టీ నాయకులు షేక్ జాను సాహెబ్, జిలాని, బాజి పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలపై అవగాహన



దుగ్గిరాల: ఋతుక్రమ సమయంలో స్త్రీలు పాటించి తీసుకోవాల్సిన ఆరోగ్య నియమాలపై అవగాహన సదస్సును దుగ్గిరాల ఈస్ట్ ఉప ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఇందిర పాల్గొని మాట్లాడారు. ఆహార నియమాలపై మహిళలతో చర్చించారు. అధిక రక్తస్రావం జరిగితే వెంటనే వైద్యుల సలహా తీసుకుని చికిత్స పొందాలని వివరించారు. కార్యక్రమంలో వి.బుజ్జి, జె.శ్యామల, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళులు



ఫిరంగిపురం: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు సేవలు ఎనలేనివని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవికుమార్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. శర్మ హాస్పిటల్‌లోని ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూరల్ పరిధిలోని పెనుమాక, కుంచనపల్లి, ప్రాతూరులో మహనీయుని జయంతిని జరిపారు.

దుగ్గిరాల: దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్ జబీన అధ్యక్షతన ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు, పార్టీ నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో తహసీల్దార్ ఐ.సునీత పాల్గొని నివాళులర్పించారు.

తెనాలి పోలీసుల తీరుపై సమగ్ర విచారణ జరపాలి

పెదకాకాని: దళిత, మైనార్టీ యువకుల పట్ల తెనాలి పోలీసులు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని.. సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ బుధవారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 24వ తేదీన పోలీసు కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై నిందితులు దాడి చేశారని ఎస్సీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన యువకులను నడిరోడ్డుపై ఇష్టానుసారంగా కొట్టి గాయపరచిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. నిందితులను కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో పోలీస్ వ్యవస్థపై గౌరవం పెరగాలి కానీ నమ్మకం కోల్పోవడం, వ్యతిరేకత ఏర్పడటం సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఎండీయూ వ్యవస్థపై శీతకన్ను

- రోడ్డున పడ్డ వాహనాల ఆపరేటర్లు
- న్యాయపోరాటానికి సిద్ధమంటున్న ఆపరేటర్లు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు

మంగళగిరి టౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడప వద్దకే రేషన్ అందించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థపై శీతకన్ను చూపుతోంది. ఈ వాహనాలను రద్దు చేయడంతో నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పునకు కిలోమీటర్ల దూరం నడవాల్సిన దుస్థితి, గంటల తరబడి చౌక దుకాణాల ముందు నిలబడాల్సిన పరిస్థితి నేడు కార్డు దారులు ఎదుర్కోవాల్సి రావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదల కోసం గత వైఎస్సార్‌సీపీ తీసుకు వచ్చిన ఒక్కో పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తుండడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. అందులో భాగంగా ఎండీయూ వాహనాలను రద్దుతో నేడు వేలాది మంది ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి లేక రోడ్డున పడ్డారు.

నియోజకర్గంలో వివరాలు ఇలా..

మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల పరిధిలో సుమారు 50 వేల మందికి పైగా బియ్యం కార్డుదారులు ఉన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలో 18, రూరల్‌పరిధిలో 16, తాడేపల్లి పట్టణ పరిధిలో 9, రూరల్ పరిధిలో 8, దుగ్గిరాల పరిధిలో 13.. ఇలా మొత్తం 64 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పట్టణంలో 27, రూరల్ పరిధిలో 41, తాడేపల్లి పట్టణంలో 15, రూరల్‌లో 19, దుగ్గిరాలలో 34.. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 136 చౌక దుకాణాలు ఉన్నాయి. ఇప్పుడు ఎండీయూ వ్యవస్థకు మంగళం చెప్పడంతో 128 మంది వీధిన పడనున్నారు. వీరిలో అనేక మంది ఉద్యోగ వయస్సు మించిపోయి.. ప్రైవేటు సంస్థల్లో ఉపాధి లభించే అవకాశం లేనివారే.

రోడ్డున పడనున్న ఆపరేటర్లు..

72 నెలల అగ్రిమెంట్ కాలంతో విధుల్లోకి చేరిన ఎండీయూ ఆపరేటర్లకు ఇంకా ఒకటిన్నర సంవత్సరం కాలపరిమితి ఉంది. 2027 జనవరి వరకూ అగ్రిమెంట్ ఉన్నా కూటమి ప్రభుత్వం తొలగించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా 64 మంది ఎండీయూ ఆపరేటర్లు రోడ్డున పడనున్నారు. ఈ పనినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆపరేటర్లు కూటమి ప్రభుత్వం నిర్ణయంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒకట్నిర సంవత్సరం అగ్రిమెంట్ సమయం ఉన్నా తొలగించడం అన్యాయమంటున్నారు. బ్యాంకుల్లో వాహనాలకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఎన్‌వోసీ సర్టిఫికెట్లు అందజేసిన తరువాత డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎండీయూ వాహనాలు

ఉపాధిని కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదే..



చదువుకుని నిరుద్యోగంలో ఉన్న మాకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధి కల్పించి ఆదుకుంది. దీని ద్వారా 9,262 మంది ఉపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా ఎండీయూ వాహనాలు రద్దు చేయడం సరికాదు. దీంతో 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పించి ప్రత్యామ్నాయంగా ఆదుకోవాలి. కరోనా సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వర్తించాం.

–డి.విజయ్, ఎండీయూ వాహనాల యూనియన్ అధ్యక్షులు

న్యాయ పోరాటానికి సిద్ధం..



అగ్రిమెంట్‌కాలం ఉండగానే మమ్మల్ని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయం. మా వాహనాలకు సంబంధించి బ్యాంకులో ఉన్న బకాయిలను ప్రభుత్వం చెల్లించి ఎన్‌వోసీ ఇప్పించాలి. మాకు న్యాయం చేయకుంటే జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేస్తే న్యాయపోరాటానికి సిద్ధం అవుతాం.

–ఎస్.రవికుమార్, ఎండీయూ వాహన ఆపరేటర్

ఉపాధి కోల్పోయాం..



కొద్దిపాటి జీతంతో కుటుంబాన్ని పోషించుకునే వీలుండేది. గత నాలుగేళ్లుగా ఎండీయూ వాహనంపై ఆధారపడి జీవిస్తున్నాం. ముందస్తు సమాచారం లేకుండా ఒక్కసారిగా కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగిస్తామని ప్రకటించడం అన్యాయం. ఉపాధి కోల్పోతున్న ఆపరేటర్లకు న్యాయం చేసిన తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బాగుండేది.

–వి.రవికుమార్, యూనియన్ సెక్రటరి, పెనుమాక

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం

తెనాలిటౌన్: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో నిర్వహించిన కేసీఎల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 10 విజేతలుగా గుంటూరు మిర్చిటీం గెలిచినట్లు టోర్నమెంట్ నిర్వాహకులు కావేటి వేణుగోపాల్ తెలిపారు. గుంటూరు మిర్చి టీంకు రూ.10,516లు నగదు బహుమతి, మెమోంటో అందజేశారు. అదే విధంగా రన్నర్స్‌గా నిలిచిన సూపర్ కింగ్ టీంకు రూ.5,116లు నగదు బహుమతి, మెమోంటో అందజేశారు. ప్రతి ఏటా కావేటి యల మందరావు స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించేందుకు తోడ్పడిన వీఎస్సార్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోలా అశోక్, కనకచారి, కావేటి సాంబ్రాజ్యం, ఆనంద్‌కుమార్, వెంకటేశ్వర్లు, మణికంఠ, పాశం వెంకటేష్, అన్నం రాజేష్, శ్రీను, ఎం.కిరణ్‌బాబు ఉన్నారు.



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

గణపతికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామం జలపాలేశ్వర ఆలయంలోని గణనాథునికి విశేష పూజలు చేశారు. బుధవారం అర్చకులు ఉమాపతిశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో పూజలు చేసి గరికతో అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 98 మందికి వైద్యురాలు ఫరీనాబేగం వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు పడుతుండడంతో దోమలు విజృంభించి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మురుగు నీరు పారేల తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ రజిత, ఏఎన్‌ఎం విజయరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు సకాలంలో చెల్లించాలి

దుగ్గిరాల: ఉపాధి హామీ వేతనాలను సకాలంలో చెల్లించాలని సీపీఎం కార్మిక మండల నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన పని ప్రదేశంలో మాట్లాడారు. వేతనాలు సకాలంలో చెల్లించడంలేదని, వేసవిలో మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉండడంలేదని, వంద రోజుల పని ఏక్కడా జరగడంలేదని, పనులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళతామని అన్నారు. కార్యక్రమంలో ఎం.నందయ్య, వి.సీ తారామయ్య, ఎం.లక్ష్మణరావు, సీహెచ్.శ్రావణి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం, చెంచుపేటలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన యోగ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగా భాగం కావాల్సిన అవసరం ఉందన్నారు. యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి దూరం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

వాకింగ్ ట్రాక్‌లపై పర్యవేక్షణ ఉండాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలోని పార్క్‌ల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్‌లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ఆర్టీసీ కాలనీ పార్క్, కాకాణి రోడ్, సీతా నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పార్కుల్లో నూతనంగా చేట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ కాలనీ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్‌లు మరమ్మతులు చేపట్టాలని ఏఈకి సూచించారు. పార్క్‌ల్లో పచ్చదనం పెంపునకు ఉద్యానవన విభాగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వర్షాలకు పార్క్‌ల వాకింగ్ ట్రాక్‌లలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చని, అందుకు పిన్ పాయింట్‌గా పారిశుద్ధ్య పనులు జరిగేందుకు సచివాలయం పరిధిలో కార్మికుల హాజరు, పనితీరు, పారిశుద్ధ్య పూర్తిగా శానిటేషన్ కార్యదర్శే బాధ్యత వహించాలని కోరారు. డ్రైయిన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎస్‌లు మధ్యాహ్నం సమయంలో కార్మికులు డ్రైయిన్లు శుభ్రం చేసేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అవుట్ ఫాల్ డ్రైయిన్లు తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులు ప్రతి రోజు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షణ చేసి, లోపాలు ఉన్న ప్రాంతాల్లో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. పర్యటనలో కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఎస్ఎస్ అయుబ్ ఖాన్, ఆర్‌ఓ సాదిక్ బాషా పాల్గొన్నారు.



అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం నుంచి కృష్ణాయపాలెం వెళ్లే రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. యర్రబాలెం నుంచి కృష్ణాయపాలెంకు ద్విచక్రవాహనంపై హఫీజ్ వెళుతున్నాడు. ఎదురుగా మరో ద్విచక్రవాహనంపై వస్తున్న రమేష్‌ను హఫీజ్ ఢీకొన్నాడు. ఘటనలో వాహనాలు నడుపుతున్న ఇద్దరు యువకులు గాయపడ్డారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదిత్య హృదయ పారాయణం, శృంగార నైషధంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రవచిస్తూ పాకిస్థాన్‌తో యుద్ధంలో భారత దేశమే పైచేయి కావాలని అన్నారు. కోవిడ్–19 బారిన పడకుండా ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. భాగవత గోష్ఠితో మూడుసార్లు ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించారు. అనంతరం శృంగార నైషధంలోని ఇతివృత్తాన్ని వివరించారు.

రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పరిశోధకుడు పి.రామకృష్ణకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ పరిశోధనా పర్యవేక్షకులు, ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పర్యవేక్షణలో 'టెక్స్ట్ క్లస్టరింగ్ అండ్ డాక్యుమెంట్ క్లాసిఫికేషన్ టెక్నిక్స్ యూజింగ్ డీప్ కాంటెక్స్చువల్ ఎంబీడింగ్స్ అండ్ ఎక్స్‌టెండెడ్ గ్లోవ్ మెథడ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

పార్టీ బలోపేతానికి యువకుల పాత్ర కీలకం

తాడికొండ: పార్టీ బలోపేతంలో యువకుల పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ వనమా బాల వజ్రబాబు (డైమండ్) సూచించారు. బుధవారం గుంటూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో తాడికొండ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ అజీస్ వజ్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కష్టపడి పనిచేసి 2029లో పార్టీ విజయం కోసం అహర్నిశలు పనిచేస్తానని అజీస్ అన్నారు. కార్యక్రమంలో తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వంగా పోలా రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు మల్లంపాటి రాఘవరెడ్డి, మండల బీసీ, విద్యార్థి విభాగం నాయకులు దమ్మాటి మోహనరావు, మల్లంపాటి చంద్రశేఖర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పులి రమేష్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డైమండ్ బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అజీస్, నాయకులు

పొగాకుపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

దుగ్గిరాల: ఈనెల 31 పొగాకు, వాటి ఉత్పత్తుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యం పరిచే పోస్టర్ ఆవిష్కరణను ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక శివాలయం దగ్గర జరిగిన ఈ కార్యక్రమంలో కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1988 సంవత్సరం నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తుందని అన్నారు. పొగాకు వల్ల అనారోగ్య సమస్యలతో ఏటా ప్రపంచ వ్యాప్తంగా 80 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. మన దేశంలో 13.5 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. పొగాకును వదిలి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో ఎం.గాంధీ, జెట్టి బాలరాజు, షేక్.సుభాని, పి.గణేష్, ఉమా మహేశ్వరరావు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మంగళగిరి టౌన్: వర్షాకాలం సమీపిస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంటీఎంసీ కమిషన్ అలీమ్‌బాషా కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఈద్గా కల్యాణ మండపంలో బుధవారం ఫ్రైడే–డ్రైడే, దోమల నివారణపై ఏఎన్‌ఎమ్‌లు, శానిటరీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. వీటిని అరికట్టేందుకు ఇంటి పరిసరాలలో ఉండే నీటి తొట్టెలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు వచ్చే ప్రమాదముందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఏఎన్ఏమ్‌లు, శానిటేషన్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా

చిన్నారికి నాట్యమయూరి అవార్డు

మంగళగిరి టౌన్: మంగళగిరికి చెందిన మునగాల జయ అక్షితకు నాట్యమయూరి అవార్డు లభించింది. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి 40వ శాస్త్రీయ, పాశ్చాత్య సంగీత, నృత్య పోటీల్లో అక్షిత పాల్గొని ప్రతిభ కనబరిచింది. కూచిపూడి 'ఏ' గ్రూప్‌లో భామాకలాపం నృత్య ప్రదర్శనకు ప్రథమ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళానిలయం ఆధ్వర్యంలో అక్షితకు నాట్యమయూరి అవార్డును ప్రదానం చేశారు. అక్షిత మంగళగిరి నగర పరిధిలోని ఓ ప్రైవేటు స్కూలులో 9వ తరగతి చదవుతోంది. అవార్డు పొందిన అక్షితను తల్లిదండ్రులు మునగాల మురళీకృష్ణ, మౌనికలతో పాటు నగర పరిధిలోని పలువురు ప్రముఖులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న అక్షిత

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

ప్రత్తిపాడు: ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు ఎదురవుతాయని.. గ్రామంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయి కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మలపాలెంలో బుధవారం స్థానిక అధికారులతో కలిసి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ (లోకల్ ట్రైనింగ్ సెంటర్)ను డీపీవో సదర్శించారు. అనంతరం గ్రామంలోని అంతర్గత వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మైకుల ద్వారా ప్రచారం చేపట్టాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం విధించాలని, ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఐటీసీ మరియు ఫినిష్ సొసైటీ సంయుక్తంగా సమకూర్చిన జూట్ బ్యాగులను ఆయన ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. డివిల్‌పీవో శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్‌లు నిరంజన్ కుమార్, కరీముద్దీన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ ఉమా మహేశ్వరి, క్లాప్ మిత్రలు, షెడ్ మిత్రలు పాల్గొన్నారు.



తుమ్మలపాలెంలో జూటు బ్యాగులు పంపిణీ చేస్తున్న డీపీవో

30న చలో మహిళా కమిషనర్ కార్యాలయం

నెహ్రూనగర్: రజక మహిళ తొరటి అనూష అనుమానాస్పద మృతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ 30వ తేదీన చలో మహిళా కమిషనర్ ముట్టడి నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దోబీ ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు కాకాని రోడ్డులో బుధవారం అనూష కుటుంబ సభ్యులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ భార్యను అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశంతో అనూష భర్త గర్భిణి అయినప్పటికీ ఆమెను సరైన వైద్యం అందించడలో నిర్లక్ష్యం వహించాడని ఆరోపించారు. ప్రయాణం చేయించకూడదని డాక్టర్లు చెప్పినా కావాలనే ప్రయాణాలు చేయించి అనూషను తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులకు గురి చేశాడని ఆరోపించారు. దీంతో పాటు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యురాలి నిర్లక్ష్యంగా వ్యవహరించి అనూష మృతికి..బిడ్డ మృతికి కారుకులయ్యారని.. ఇదంతా ఒక పథకం ప్రకారమే జరిగిందన్నారు. దీనిపై నిజనిర్ధారణ చేయాలని డిమాండ్‌తో చలో మహిళా కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య